


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
సోమవారం
09-02-2026
పేజీలు: 02



# లంక బోణీ

ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో సహ ఆతిథ్యదేశంగా ఉన్న శ్రీలంక ఈ టోర్నీని విజయంతో ఆరంభించింది. సొంత మైదానం (కొలంబో)లో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో ఆ జట్టు.. ఐర్లాండ్‌పై 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో రాణించలేక చతికిలపడ్డ ఆ జట్టు.. బంతితో మాత్రం ప్రత్యర్థిని కట్టడిచేసింది. టాస్ ఓడి మొదలు బ్యాటింగ్ చేసిన లంకేయులు.. 20 ఓవర్లకు 163/6కు మాత్రమే పరిమితమయ్యారు. కుశాల్ మెండిస్ (43 బంతుల్లో 56, 5 ఫోర్లు) నిలకడకు తోడు ఆఖర్లో కమిందు మెండిస్ (19 బంతుల్లో 44, 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ మెరుపులతో ఆ జట్టు గౌరవప్రదమైన స్కోరు చేసింది. ఐర్లాండ్ బౌలర్లలో డాక్‌రెల్ (2/17), మెక్‌కార్తి (2/40) తలా రెండు వికెట్లు తీశారు. ఛేదనలో ఐర్లాండ్ 19.5 ఓవర్లలో 143 రన్స్ వద్దే ఆగిపోయింది. హ్యారీ టెక్టర్ (40) టాప్ స్కోరర్. లంక స్పిన్నర్లు తీక్షణ (3/23), హసరంగ (3/25) తలా మూడు వికెట్లతో ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

# రేవంత్ జైలుకు పోవడం ఖాయం

## అందుకే ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేసిండు: హరీష్ రావు

ఓటుకు నోటు కేసులో రేవంత్ జైలుకు పోవడం ఖాయమని.. అందుకే ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేసిండని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. జైలుకు పోకుండా ఉండేందుకు సాక్ష్యాలు మాయం చేసిండుప్రమాదవశాత్తు జరిగింది కాదు.. రేవంత్ డైరెక్షన్‌లో జరిగిన ప్రమాదం ఇదన్నారు. మెదక్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. ఫోరెన్సిక్ ల్యాబ్ జరిగిన అగ్ని ప్రమాదం వెనుక రేవంత్ రెడ్డి హస్తం ఉంది. ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన దొంగ జైలుకు పోయే సమయం దగ్గరకు వచ్చింది. అందుకే సాక్ష్యాలు మాయం చేసేందుకు హైద్రాబాద్‌లో ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేసిండని హరీష్ రావు ఆరోపించారు. పోలీసుల సహకారంతో ఈ కుట్ర పన్నిండు. హైద్రాబాద్ లో పేదల బతుకులు కూల్చిండని మండిపడ్డారు. జైలుకు పోకుండా ఉండేందుకు సాక్ష్యాలను మాయం చేసిండు. రేవంత్ డైరెక్షన్‌లో పోలీసులు చేసిన దహనకాండ. ప్రమాదవశాత్తు జరిగింది కాదు. రేవంత్ చేసింది. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డికి శిక్ష పడక తప్పడు, జైలుకు పోక తప్పదు. రెండున్నరేండ్ల కాలంలో కాంగ్రెస్ చేసింది గుండు సున్నా. మిర్యాలగూడ, భూపాలపల్లి, నిజామాబాద్ పోయిండు ముఖ్యమంత్రి కానీ మెదక్ కు వచ్చేందుకు ముఖం లేదు. ఏడుపాయల అమ్మవారి మీద ఒట్టు వేసి మాట తప్పిండు కాబట్టి ఆయనకు భయం, రుణమాఫీ మాట తప్పి మోసం చేసిండు. రైతు బంధు ఎగ్గొట్టిండు. ఎరువుల కరువు తెచ్చిండు రేవంత్. రేవంత్ బూతులు మాట్లాడటం తప్ప ఒక్క మంచి పని చేయలేదు. రంజాన్ తోఫా కూడా ఇవ్వడం లేదు. షాదీ ముబారక్ చెక్కులు రావడం లేదు. తులం బంగారం దిక్కు లేదన్నారు. కేసీఆర్ మైనార్టీ గురుకులాలు కట్టారు. షాదీ ఖానా ఏర్పాటు చేసారు. కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని సెక్యులర్ పార్టీగా నిలబెట్టారని హరీష్ రావు అన్నారు. హిందూ ముస్లింలను అన్నదమ్ములుగా చూశారని అన్నారు. రేవంత్ రెడ్డి తెల్లవారితే కేసీఆర్‌ను తిడుతుంటాడు. కేసీఆర్‌ను తిడితే, హరీష్ రావును తిడితే పేదల కడుపు నిండుతుందా..? ఇక్కడి ఎమ్మెల్యే చాలా గొప్పోడు.ఎన్నికల సమయంలో 25 గంటల కరెంటు ఇస్తా అన్నడు. కనీసం 12 గంటలు కూడా రావడం లేదు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12వేలు అని గుండు కొట్టిండన్నారు. ఉద్యోగస్థులకు డీఏ లేదు, పీఆర్సీ లేదు.రిటైర్డ్ ఉద్యోగులకు రిటైర్ బెనిఫిట్స్ లేవు. అన్ని వర్గాల ప్రజలను దారుణంగా సీఎం రేవంత్ రెడ్డి మోసం



చేసిండు అని హరీష్ రావు అన్నారు.ఎస్సీ, బీసీ, ఎస్టీ పిల్లల చదువులను ఆగం చేసిండు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అని దగా చేసిండు. రెండు లక్షల ఉద్యోగాలని నిరుద్యోగులను మోసం చేసిండు.కాంగ్రెస్ వాళ్లను గెలిపించుకోకుంటే బిల్లులు రావని బెదిరిస్తున్నరట. మెదక్‌లో నీ పిట్ట బెదిరింపులకు, చిల్లర బెదిరింపులకు భయపడం. బిల్లులు మీ జేబుల నుంచి ఇస్తున్నారా..? మీ జాగిరా..? బరాబర్ బిల్లులు వస్తయి, కొట్లాడి సాధించుకుంటమన్నారు.


# మానవ వ్యర్థాలతో క్యాన్సర్ ఔషధం

క్యాన్సర్‌కు మానవ వ్యర్థాలతో ఔషధాన్ని కెనడా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. వీటిని 'ఫెకాల్ కాప్సూల్స్' అని, శాస్త్రీయ భాషలో ఫెకాల్ మైక్రోబయోటా లేదా ఎఫ్ఎంటి అని పిలుస్తారు. ఆరోగ్యవంతుడైన మనిషి వ్యర్థాలను ఫ్రీజ్ చేసి, ఎండపెట్టి వాటిని ఎఫ్ఎంటి క్యాప్సూల్స్‌గా తయారు చేస్తారు. ఈ గోలీలు పొట్టలోకి చేరి మంచి సూక్ష్మజీవులను పెంపొందిస్తాయి.ఊపిరితిత్తుల క్యాన్సర్ విషయంలో సాధారణంగా వాడే ఔషధాలతో పోలిస్తే ఈ ఎఫ్ఎంటి గోలీలు 40-45 శాతం ఎక్కువ ప్రయోజనకరంగా పనిచేస్తాయి. వీటిని సాధారణ క్యాన్సర్ ఔషధాలతో కలిపి తీసుకొంటే 80 శాతం ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది.



## మా అమ్మకు మళ్లీ పెళ్లి చేయాలనుంది ... సుప్రీత ఎమోషనల్ కామెంట్స్ వైరల్

టాలీవుడ్ సీనియర్ నటి సురేఖా వాణి తెలుగుతో పాటు తమిళ చిత్రాల్లోనూ కీలక పాత్రలు పోషిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా 'బొమ్మరిల్లు' సినిమాతో ఆమెకు మంచి పేరు వచ్చింది. కొంతకాలంగా సినిమాలకు గ్యాప్ ఇచ్చిన సురేఖా వాణి ఇప్పుడు తెరపై తక్కువగా కనిపిస్తున్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటున్నారు. ఇదిలా ఉండగా ఆమె కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా ఇండస్ట్రీలోకి అడుగుపెడుతూ 'అమరావతికి ఆహ్వానం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రం ఫిబ్రవరి 13న విడుదల కానుండగా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సుప్రీత తన తల్లి గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.



## 97 ఏండ్ల వయసులో గర్ల్‌ఫ్రెండ్‌తో పెండ్లి!

సింగపూర్‌లో ఓ వృద్ధుడు(97) 50 ఏండ్ల నిరీక్షణ తర్వాత తన గర్ల్‌ఫ్రెండ్‌ను పెండ్లి చేసుకోనున్నారు. వృద్ధుడికి 1950లో పెండ్లయ్యింది. అయితే 1971లో అతడు తన కార్యదర్శితో ప్రేమలో పడ్డాడు. 2014లో తన భార్య చనిపోయిన తర్వాత 2016లో తన ప్రియురాలిని తన ఇంటికి తీసుకొచ్చి ఆమెతో కలిసి జీవిస్తున్నాడు. 2021లో వారిద్దరూ పెండ్లి చేసుకోవాలనుకున్నారు. అయితే తన తండ్రికి చిత్త వైకల్యం ఉందని, ఆయన ప్రియురాలు ఆయన ఆస్తి కోసమే పెండ్లికి ఒప్పుకొందని వృద్ధుడి కుమారుడు కోర్టులో కేసు వేశాడు. అయితే వైద్య పరీక్షల ప్రకారం వృద్ధుడు ఆరోగ్యంగా ఉన్నాడని తెలిపిన కోర్టు వారిద్దరి 50 ఏండ్ల సంబంధాన్ని మోసమని పేర్కొనడం సరైంది కాదని తీర్పు ఇచ్చింది.

## హాంకాంగ్ మీడియా టైకూన్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష



హాంకాంగ్‌లో ప్రజాస్వామ్య ఉద్యమానికి మద్దతుగా నిలిచిన మీడియా దిగ్గజం, 'యాపిల్ డైలీ' పత్రిక వ్యవస్థాపకుడు జిమ్మీ లాయ్‌కు స్థానిక కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. 78 ఏళ్ల జిమ్మీ లాయ్‌పై జాతీయ భద్రతా చట్టం కింద ఈ తీర్పు వెలువడింది. హాంకాంగ్‌లో ఈ చట్టం కింద విధించిన అత్యంత కఠినమైన శిక్ష ఇదే కావడం గమనార్హం. విదేశీ శక్తులతో కుమ్మక్కై చైనా, హాంకాంగ్‌లపై ఆంక్షలు విధించేలా కుట్ర పన్నారని, దేశద్రోహపూరిత కథనాలను ప్రచురించారని జిమ్మీ లాయ్‌పై అభియోగాలు నమోదయ్యాయి. ఈ ఆరోపణలపై విచారణ జరిపిన ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఆయనను దోషిగా నిర్ధారించింది. 2019 నాటి ప్రజాస్వామ్య అనుకూల నిరసనల తర్వాత ఈ కుట్రలకు జిమ్మీ లాయ్ "మాస్టర్‌మైండ్"గా వ్యవహరించారని కోర్టు పేర్కొంది. 2020లో బీజింగ్ ప్రభుత్వం హాంకాంగ్‌లో వివాదాస్పద జాతీయ భద్రతా చట్టాన్ని అమలులోకి తెచ్చింది. ఈ చట్టం కిందనే జిమ్మీ లాయ్‌ను అరెస్టు చేసి విచారించారు. మరో కేసులో గత రెండేళ్ల నుంచి ఆయన జైలు శిక్ష అనుభవిస్తుండడంతో, ఈ తాజా తీర్పుతో ఆయన మరో 18 ఏళ్లు జైల్లోనే గడపాల్సి ఉంటుందని జడ్జి పేర్కొన్నారు. ఈ తీర్పుపై జిమ్మీ లాయ్ కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అత్యంత కఠోరమైన, క్రూరమైన శిక్ష అని ఆయన కుమారుడు సెబాస్టియన్ అన్నారు. "ఈ వయసులో ఈ శిక్ష ఆయన ప్రాణాలకు ముప్పు" అని పేర్కొన్నారు. తన తండ్రి ఆరోగ్యం క్షీణిస్తోందని, ఈ శిక్షతో ఆయన జైల్లోనే అమరుడవుతారని కుమార్తె ఆవేదన వ్యక్తం చేశారు.




## తెలంగాణలోని ఆ ప్రాంతాల్లో రెండు రోజులపాటు వైన్స్ బంద్

తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అధికార యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా నిర్వహించేందుకు వీలుగా పోలింగ్ జరిగే ప్రాంతాల్లో రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు, బార్లను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారం ముగిసే సమయమైన ఇవాళ సాయంత్రం 5 గంటల నుంచి పోలింగ్ ముగిసే ఫిబ్రవరి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం అమ్మకాలపై పూర్తి నిషేధం విధిస్తున్నట్లు ఎన్నికల, ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రకటించారు. అంతేకాకుండా ఓట్ల లెక్కింపు జరిగే ఈ నెల 13వ తేదీన కూడా పూర్తిస్థాయిలో వైన్స్, బార్లను మూసివేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ నిబంధనలను అతిక్రమించి ఎవరైనా మద్యం విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు.



## కానీ అలాంటివి అడుగుతారు

రీసెంట్ డేస్ లో చాలా మంది ముద్దుగుమ్మలు గ్లామర్ డోస్ పెంచుతున్నారు. సినిమాల్లో పాత్ర డిమాండ్ చేస్తే ఎలాంటి రోల్ చేయడానికైనా రెడీ అవుతున్నారు. మొన్నటివరకూ పద్దతిగా కనిపించిన ఈ హీరోయిన్స్ చాలా మంది ఇప్పుడు గ్లామర్ గేట్లు ఎత్తేస్తున్నారు. రీసెంట్ గా ఓ అందాల భామ కూడా గ్లామర్ రోల్ లో నటించి షాక్ ఇచ్చింది. అప్పటివరకు పద్ధతిగా కనిపించిన ఆమె సడన్ గా గ్లామర్ రోల్ లో కనిపించడంతో ఒక్కసారిగా అభిమానులు షాక్ అయ్యారు. తాజాగా ఓ జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు ఒక్కసారిగా సీరియస్ అయ్యింది ఆ ముద్దుగుమ్మ. మంచి సినిమా తీస్తే మీరే చూడరు. అదే గ్లామర్ రోల్ చేస్తే మాత్రం జీర్ణించుకోలేకపోతున్నాం అని అంటారు అంటూ సీరియస్ అయ్యింది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.?టాలీవుడ్ లో ఎంతో మంది హీరోయిన్స్ గ్లామర్ రోల్స్ కూడా దూరంగా ఉంటూ నటనకు ప్రాధాన్యత ఉన్నపాత్రలు చేస్తూ దూసుకుపోతున్నారు వారిలో అనుపమ పరమేశ్వరన్ ఒకరు. ప్రేమమ్ సినిమాతో సినీరంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టిన అనుపమ.. 2015లో స్టార్ స్టేటస్ అందుకుంది. తెలుగు, తమిళం, మలయాళంలో వరుస ఆఫర్స్ అందుకుని ఈ బ్యూటీ రోజు రోజుకు మరింత పాపులర్ అయ్యింది. చూడచక్కని రూపం.. అద్భుతమైన నటనతో కట్టిపడేసింది. కానీ అనుపమకు అనుకున్నంతగా సరైన బ్రేక్ మాత్రం రాలేదు. ఇప్పటివరకు అనేక హిట్ చిత్రాల్లో నటించిన అనుపమకు.. స్టార్ హీరోల సినిమాల్లో మాత్రం ఛాన్స్ రాలేదు.

## 'స్పిరిట్' నుంచి ప్రకాష్ రాజ్ ఔట్?

టీజర్ విడుదలైనప్పటి నుంచి 'స్పిరిట్' సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్డేట్ కూడా సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అవుతోంది. ఈ క్రమంలో తాజాగా మరో క్రేజీ న్యూస్ చర్చనీయాంశంగా మారింది. ఈ చిత్రంలో ప్రముఖ సీనియర్ నటుడు ప్రకాష్ రాజ్ కీలక పాత్రలో నటిస్తున్నారని ముందుగా వార్తలు వచ్చాయి. అంతేకాదు వాయిస్ టీజర్‌లో కూడా ఆయన వాయిస్ వినిపించడంతో సినిమాలో ఆయన పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావించారు. అయితే ఇప్పుడు అనూహ్యంగా 'స్పిరిట్' ప్రాజెక్ట్ నుంచి ప్రకాష్ రాజ్ తప్పుకున్నారనే వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ విషయం పై అధికారిక ప్రకటన ఏదీ రాకపోయినా, సోషల్ మీడియా మరియు జాతీయ స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్ వేదికల్లో ఈ వార్త విస్తృతంగా ప్రచారం పొందుతోంది. ఆయన ఎందుకు తప్పుకున్నారనే విషయంపై స్పష్టత లేకపోవడంతో ఆసక్తి మరింత పెరిగింది.



నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM


## కేసీఆర్ దత్తపుత్రుడు కిషన్ రెడ్డి

మాజీ సీఎం కేసీఆర్ దత్తపుత్రుడు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోనియా, రాహుల్ గాంధీలను సీబీఐ, ఈడీలతో ప్రధాని మోదీ వేధిస్తారని.. కానీ బీఆర్ఎస్ నేతల వైపు ఆయన చూడరని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య చీకటి బంధం.. ఫెవికాల్ బంధం ఉందని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఆదివారం నాడు జయశంకర్ భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.



## ఖమ్మం జిల్లాలో సాగునీటి కోసం రైతన్నల ధర్నా

ఖమ్మం జిల్లాలో సాగునీటి కోసం రైతన్నలు రోడ్డెక్కారు. కొణిజర్ల మండలం గుబ్బగుర్తి వద్ద రహదారిపై రాస్తారోకోకు దిగారు. సాగు నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని.. వెంటనే సాగునీటిని అందించిన పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. నాగార్జున సాగర్ నుంచి అధికారులు నీళ్లు విడుదల చేయకపోవడంతో తమ మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయని ఈ సందర్భంగా రైతన్నలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్థానిక నాయకులను కలిసినా పట్టించుకోవడం లేదన్నారు. దీనికి నిరసనగానే ఏన్కూరు — పల్లిపాడు రహదారిపై రైతన్నలు ఆందోళనకు దిగారు. రైతుల ఆందోళనతో రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.



## అమృతాను మతం మారమనలేదు: సైఫ్ అలీ ఖాన్ ఆసక్తికర విషయాలు

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్, కరీనా కపూర్‌ను 2012లో వివాహం చేసుకుని సంతోషంగా జీవిస్తున్నప్పటికీ, తన మొదటి భార్య అమృతా సింగ్‌తో బంధం, విడాకులు, మతాంతర వివాహంలో ఎదురయ్యే సవాళ్ల గురించి మాట్లాడటానికి ఎప్పుడూ వెనుకాడరు. తాజాగా ఆయన గతంలో పంచుకున్న కొన్ని విషయాలు, వారి వివాహానికి సంబంధించిన ఆసక్తికరమైన వివరాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. సైఫ్ అలీ ఖాన్‌కు, అమృతా సింగ్‌కు మధ్య 13 ఏళ్ల వయసు వ్యత్యాసం ఉంది. వారిద్దరి ప్రేమ, హడావుడిగా జరిగిన పెళ్లి ఇప్పటికీ చాలామందిని ఆశ్చర్యపరుస్తుంది. సైఫ్ తల్లి షర్మిలా ఠాగూర్, మన్సూర్ అలీ ఖాన్ పటౌడీని పెళ్లి చేసుకున్న తర్వాత ఇస్లాం మతంలోకి మారారు. కానీ, సైఫ్ తన మొదటి భార్య అమృతాను మతం మారమని ఎప్పుడూ ఒత్తిడి చేయలేదని స్పష్టం చేశారు. 2010లో 'ది సియాసత్ డైలీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, "డింగీ (అమృతాను ఆయన అలా ముద్దుగా పిలుస్తారు)ని ఇస్లాంలోకి మారమని గానీ, ఆ మతాన్ని ఆచరించమని గానీ ఎన్నడూ బలవంతం చేయలేదు. మొదటి నుంచి ఎవరి మతం వారిదే అనే సూత్రాన్ని పాటించాం.

## 11న జీహెచ్ఎంసీ విభజన..?




సమీప మునిసిపాలిటీల విలీనంతో దేశంలోనే అతిపెద్ద మునిసిపల్ కార్పొరేషన్‌గా అవతరించిన గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ను ఒకటిగానే ఉంచుతారా? మూడు ముక్కలు చేస్తారా? అన్నది ఒకటిరెండు రోజుల్లో తేలనుంది. 2,053 చరదపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న జీహెచ్ఎంసీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా విభజించిన విషయం తెలిసిందే. దీనిని పరిపాలనా సౌలభ్యం కోసం మూడు కార్పొరేషన్లుగా విభజించనున్నట్లు కొన్నిరోజులుగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన మ్యాపింగ్ పూర్తయ్యిందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇందుకనుగుణంగానే సైబరాబాద్ పరిధిలోని మూడు జోన్లకు సృజన, మల్కాజిగిరి వైపు మూడు జోన్లకు వినయ్‌కృష్ణారెడ్డిని ప్రత్యేక అదనపు కమిషనర్లుగా నియమించారని అంటున్నారు. జీహెచ్ఎంసీ ప్రస్తుత పాలక మండలి గడువు మంగళవారం (10వ తేదీ)తో ముగుస్తుంది. పాలకమండలి ఉన్న సమయంలో విభజిస్తే సాంకేతిక, చట్టపరమైన ఇబ్బందులు వచ్చే అవకాశముంది. అందుకే 10వ తేదీ తర్వాత విభజనపై అధికారికంగా నిర్ణయం తీసుకోవాలని సర్కారు నిర్ణయించినట్టు సమాచారం.

## భార్య ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కానిస్టేబుల్ సస్పెన్షన్



ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతూ, చేర్యాల మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన తన భార్యకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నట్లు ఆధారాలతో రుజువు కావడంతో సిద్దిపేట జిల్లా కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కె. రమేశ్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం, పోలీసు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడం వంటి కారణాలతో ఈ చర్య తీసుకున్నట్లు సీపీ సాధన రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే రమేశ్ భార్య, చేర్యాల 2వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి కమలాపురం గీతాంజలి నిరసనకు దిగారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన ఆమె అక్కడే బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గీతాంజలి మాట్లాడుతూ.. తమ ప్రత్యర్థికి ఓటమి భయం ఉండటంతో అధికార బలాన్ని ఉపయోగించి తన భర్తను సస్పెండ్ చేయించారని ఆరోపించింది. తాను నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఎన్నో ప్రలోభాలు చూపించి పోటీ నుంచి తప్పించేందుకు ప్రయత్నించారని, అంగీకరించకపోవడంతో చివరకు ఇలా కక్ష సాధించారని ఆమె విమర్శించారు.

## యాక్షన్ మోడ్‌లో ఎన్టీఆర్



ప్రశాంత్ నీల్ సినిమా కోసం తారక్ బాగా స్లిమ్ అయ్యారు. ఆ మధ్య ఓ యాడ్ ఫిల్మ్‌లో చిక్కిన ఎన్టీఆర్‌ని చూసి అభిమానులు కాస్త ఇబ్బందిగా ఫీలయ్యారు. అయితే.. ఆ పాత్ర కోసం తారక్ అలా మేకోవర్ కావాల్సివచ్చిందని చిత్రబృందం చెబుతున్నది. ఈ సినిమా తాజా షెడ్యూల్ జోర్డాన్‌లో మొదలైంది. ఈ నేపథ్యంలోనే ఎయిర్‌పోర్ట్‌లో హడావిడిగా వెళ్తున్న తారక్ ఫొటోలు కొన్ని సోషల్ మీడియాలో తాజాగా వైరల్ అయ్యాయి. ఆ ఫొటోల్లో గడ్డం పెంచి, మంచి షార్ప్ ఫిజిక్‌తో, మునుపటి మీద స్టైలిష్‌గా, అందంగా కనిపిస్తున్న తమ అభిమాన హీరోను చూసి ఫ్యాన్స్ సంబరపడిపోతున్నారు. ఇదిలావుంటే.. ఆదివారం నుంచి జోర్డాన్‌లో కొత్త షెడ్యూల్ మొదలైంది. ఈ ఇంటర్నేషనల్ షెడ్యూల్‌లో మూడు భారీ యాక్షన్ సీక్వెన్స్‌ని తెరకెక్కిస్తారు. ఈ ఎపిసోడ్స్ కథలో కీలకంగా ఉంటాయని తెలుస్తున్నది. ఎన్టీఆర్ కెరీర్‌లోనే దీన్ని అత్యుత్తమ చిత్రంగా నిలిపేందుకు ప్రశాంత్‌నీల్ అహరహం శ్రమిస్తున్నారని తెలిసింది. మైత్రీ మూవీమేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం సమకూరుస్తున్న విషయం విదితమే.

## 11న నిఖిల్ 'స్వయంభూ' టీజర్




యంగ్ అండ్ ప్రామిసింగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ హీరోగా సంయుక్త మీనన్ అలాగే నభా నటేష్ హీరోయిన్స్ గా భరత్ కృష్ణమాచారి తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ పీరియాడిక్ డ్రామా చిత్రం "స్వయంభూ" చేస్తున్న సంగతి తెలిసిందే. మరి ఈ సినిమాపై టీం అంతా మంచి అంచనాలు పెట్టుకున్నారు. ఇక ఈ సినిమా నుంచి నుంచి అవైటెడ్ టీజర్ ని రిలీజ్ చేసేందుకు మేకర్స్ డేట్ ని ఫిక్స్ చేశారు. ఈ ఫిబ్రవరి 11న ఈ సినిమా తాలూకా టీజర్ ని వదులుతున్నట్టు కన్ఫర్మ్ చేసారు. ఇక దీనితో రిలీజ్ చేసిన పోస్టర్ కూడా మంచి పవర్ఫుల్ గా కనిపిస్తుండగా వారియర్ లుక్ లో నిఖిల్ అదరగొట్టాడు. ఇక ఈ సినిమాకి రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా భువన్, శ్రీకర్ లు నిర్మాణం వహిస్తున్నారు. మరి ఈ రానున్న టీజర్ తో కొత్త రిలీజ్ డేట్ ని రివీల్ చేస్తారో లేదో అనేది చూడాలి.




## మళ్లీ బర్డ్ ఫ్లూ కలకలం.. హఠాత్తుగా 24 వేల కోళ్లు మృతి

ఏపీలో బర్డ్ ఫ్లూ వైరస్ మళ్లీ కలకలం రేపుతోంది. అన్నమయ్య జిల్లా సదుం మండలంలోని మూడు గ్రామాల్లో భారీ సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. పుట్టవాండ్లపల్లె, కంభంవారిపల్లె, అమ్మగారిపల్లె గ్రామాల్లోని కోళ్ల ఫారాల్లో గత కొన్నిరోజులుగా అసాధారణ రీతిలో కోళ్లు మరణించడం స్థానికంగా ఆందోళన కలిగించింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు దాదాపు 24 వేలకు పైగా కోళ్లు మరణించినట్లుగా నిర్ధారించారు. అనుమానంతో మృతి చెందిన కోళ్ల నమూనాలను మధ్యప్రదేశ్‌లోని భోపాల్ గల హై సెక్యూరిటీ యానిమల్ డిసీజ్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌కు పంపించగా.. బర్డ్ ఫ్లూ వ్యాధి నిర్ధారణ అయ్యింది. దీంతో చనిపోయిన కోళ్లు అన్ని కూడా బర్డ్ ఫ్లూతోనే మరణించినట్లుగా అధికారులు ధృవీకరించారు. అమ్మగారిపల్లె, పుట్టవారిపల్లె కోళ్లు బర్డ్ ఫ్లూతోనే మరణించాయని నిర్ధారణ అయ్యిందని, కంభంవారిపల్లె గ్రామంలో చనిపోయిన కోళ్లకు చనిపోయిన కోళ్ల నివేదిక రావాల్సి ఉందని జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై తెలిపారు.



## చూపించి చంపేస్తోందిగా..

సినిమా ఇండస్ట్రీలో చాలా కాలం పాటు అగ్ర హీరోయిన్ గా కొనసాగాలి అంటే అంత సాధారణమైన విషయం కాదు. పోటీలో చాలామంది బ్యూటీలు వస్తూ ఉంటారు వెళుతూ ఉంటారు. ఈ క్రమంలో గ్లామర్ ను కాపాడుకుంటూ మంచి అవకాశాల కోసం ప్రయత్నాలు చేస్తూ ఉండాలి. అలాగే కొన్ని డిజాస్టర్స్ కూడా హీరోయిన్స్ కెరియర్ కు ప్రమాదంగా మారుతూ ఉంటాయి. ఇక మొదట్లో కొన్ని విజయాలు చూసిన శాన్వి కొంతకాలం తర్వాత తెలుగు ఇండస్ట్రీలో కనిపించకుండా పోయింది. ఇక ఈ బ్యూటీ ఇప్పుడు ఇండస్ట్రీలలో బిజీ అయ్యే ప్రయత్నం చేస్తుంది. ఇక చాలాకాలం తర్వాత అమ్మడు ఒక ఊహించని లుక్ లో కనిపించింది. బికినీ ఫొటో కూడా వైరల్ గా మారింది. ఆ వివరాల్లోకి వెళితే..తెలుగులో అలా బిజీబిజీగా: లవ్లీ సినిమాతో సినీ రంగంలో అడుగు పెట్టిన శాన్వి శ్రీవాత్సవ ఏడాదికి ఒకటీ లేదా రెండు సినిమాలు చేస్తూ వస్తోంది. తెలుగుతో పాటు కన్నడ సినిమాల్లోనూ నటించి మెప్పిస్తోంది. అందం, అభియనంతో వేలాది మంది అభిమానుల్ని సొంతం చేసుకున్న ఈ క్యూట్ బ్యూటీ.. నటిగా, ప్రచార కర్తగా కొనసాగుతోంది. లవ్లీ తర్వాత సుశాంత్ తో అడ్డా సినిమాలో కనిపించి అదరగొట్టింది. ఆ తర్వాత రౌడీ, ప్యార్ మే పడిపోయానే వంటి తెలుగు చిత్రాల్లో కనిపించింది.

## పాక్ నిర్ణయం ఆశ్చర్యం కలిగిస్తోంది: గంగూలీ



ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా భారత్‌తో జరగాల్సిన కీలక మ్యాచ్ నుంచి పాకిస్థాన్ తప్పుకోవడంపై టీమిండియా మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ తీవ్ర ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఫిబ్రవరి 15న కొలంబోలో భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్టు పాకిస్థాన్ ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టాడు. 'వరల్డ్ కప్‌లో ఒక మ్యాచ్ ఆడకుండా వెనక్కి తగ్గడం ఏంటి? మ్యాచ్ శ్రీలంకలోనే జరుగుతుంది కదా. ప్రపంచ కప్‌లో ప్రతి పాయింట్ ఎంతో కీలకం. ఇలాంటప్పుడు పాక్ తీసుకున్న నిర్ణయం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది' అని గంగూలీ వ్యాఖ్యానించాడు. ఈ విషయంపై కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా స్పందించాడు. 'మేం పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాం. మా ఫ్లైట్ కూడా బుక్ అయింది. ఫిబ్రవరి 15న మాకు మ్యాచ్ ఉందని చెప్పారు. మిగతా వాళ్ల నిర్ణయం మన చేతిలో ఉండదు' అని సూర్య స్పష్టం చేశాడు.

## మరోసారి పెరిగిన బంగారం, వెండి ధరలు




గత మూడు, నాలుగు రోజులు స్థిరంగా కొనసాగిన బంగారం, వెండి ధరలు సోమవారం మళ్లీ యూటర్న్ తీసుకున్నాయి. భారీ పెరుగుదల నమోదు చేశాయి. బంగారం గ్రాముకు రూ.200కు పైగా పెరిగింది. వెండి కిలోకు రూ.15 వేలు పెరిగింది. ఈ రోజు (ఫిబ్రవరి 9న) ఉదయం 10:30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,58,840కి చేరింది. నిన్నటి ధరతో పోల్చుకుంటే 2,240 రూపాయలు పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,600కి చేరింది. నిన్నటి ధరతో పోల్చుకుంటే 2,050 రూపాయలు పెరిగింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.1,58,990కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.1,45,750కి చేరుకుంది. ఇక, వెండి కూడా భారీ పెరుగుదల నమోదు చేసింది. మళ్లీ రూ.3 లక్షల మార్క్‌కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే కిలోకు ఏకంగా రూ.15 వేలు పెరిగింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.3 లక్షలుగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా కిలో వెండి ధర రూ.3 లక్షలుగా ఉంది.